క్లుప్తంగా

బుట్టాయగూడెం ఎస్సైగా వెంకన్న నియామకం


ఎస్సైగా నియమితులైన వెంకన్న

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం ఎస్సైగా కె.వెంకన్న నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఎం.జయబాబును తడికలపూడి ఎస్సైగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్సై జయబాబు 2021 ఆగస్టు నెలలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. మండలంలో అనేక కీలకమైన కేసుల పరిష్కారంలో జయబాబు ఎనలేని కృషి చేశారు.

పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారిగా శ్రీనివాసరావు


పి శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి

చింతలపూడి : చింతలపూడి మండలం, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారిగా పి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఏలూరు మండలం, గుడివాడలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు వైద్యాధికారిణి డా.మానస ఆదివారం తెలిపారు.

శ్రీవారి సన్నిధిలో...


ధార్మిక పరిషత్ సభ్యులు నరసింహరావుకు శ్రీవారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ధార్మిక పరిషత్ సభ్యులు సంఘ నరసింహారావు ఆదివారం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఈఓ ఎం. విజయరాజు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందిన ఆయనకు, ఈఓ విజయరాజు స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.


77,166 జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

దెందులూరు: దెందులూరు మండలంలో 77,166 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు ఇచ్చామని దెందులూరు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్ బుద్ధావ్యాస్ అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 74 పాఠశాలల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సమన్వయం, ప్రణాళికతో విద్యార్థులకు సకాలంలో పాఠశాల తెరిచిన 10 రోజులలోపే పంపిణీ పూర్తి చేయడం విశేషమన్నారు. ఆలస్యం కాకుండా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ప్రభుత్వం పంపిణీ చేసిన 77,166 జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసిన అందరినీ ఎంఈఓ అభినందించారు.

యలమర్తి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

దెందులూరు: పెరుగ్గూడెంలో ఇటీవల మృతి చెందిన యలమర్తి సోమబ్రహ్మం చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు, యలమర్తి కుటుంబ సభ్యులున్నారు.

మానవత సేవలు మరింత విస్తృతం


సిద్ధాపురంలో సమావేశంలో మాట్లాడుతున్న నౌడు అచ్యుతరామారావు

నిడమర్రు: మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు గ్రామాల్లో మరింత విస్తృతం చేసేలా క్షేత్రస్థాయిలో ఉన్న సభ్యులు కృషి చెయ్యాలని ఆ సంస్థ మండల అధ్యక్షుడు నౌడు వెంకట అచ్యుత రామారావు అన్నారు. సిద్ధాపురం మాజీ సర్పంచ్ నౌడు జానకిలక్ష్మి నివాసంలో మండల మానవత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ మాట్లాడుతూ మండలంలో 14 ఫ్రీజర్లు అందుబాటులో ఉన్నాయని వాటిలో మరమ్మతులు ఉంటే తక్షణం చేయించాలన్నారు. మానవత సేవలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లి గత ఏడాదికంటే ఈ సంవత్సరం సభ్యత్వాల సంఖ్యను పెంచాలని నూతన కమిటీకి సూచించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కోశాధికారి కాన్వెంట్ శ్రీను, జాయింట్ కార్యదర్శి సంకు కొండలరావునాయుడు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, ముత్యాల చిన సత్యనారాయణ, విశ్వనాథరాజు, ఎంసీహెచ్ అప్పారావు తదితరులున్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం మెండు

- గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు సరఫరా
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు


పచ్చిరొట్ట పంట


పచ్చిరొట్ట విత్తనాలను గిరిజన రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం : పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నారు. భూసారం పెంచి పంటలు అధిక దిగుబడులు సాధించే విధంగా పచ్చిరొట్ట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. దీనిలో భాగంగా గిరిజన ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల పరిధిలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు అందిస్తుంది. ఈ ఏడాది కూడా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. అయితే పచ్చిరొట్ట సాగుపై రైతులకు పూర్తి అవగాహన కలిగించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

పచ్చిరొట్ట సాగులో ప్రయోజనం

పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. భూమిలో ఉన్న పోషకాలను చేనుకు సమతుల్యంగా అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సల్ఫర్, పాస్ఫరస్ భూమిలోని నత్రజని జింక్ వంటి సూక్ష్మ, స్థూల మూలాలన్నీ సమృద్ధిగా ఉంటాయి. అలాగే చేనుకు కావాల్సిన పోషకాలను అందించడంలో పచ్చిరొట్ట దోహదపడుతుంది. ఎరువుల వినియోగం తగ్గుతుంది. పచ్చిరొట్ట సాగు చేయడం వలన భూమిలో వానపాముల సంఖ్య పెరుగుతుంది. అలాగే పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చెందుతాయి.

పచ్చిరొట్ట సాగు చేయు విధానం

వరుసగా 3 నుంచి 5 సంవత్సరాల పాటు ఖరీఫ్ పంట వేసుకునే ముందు పచ్చిరొట్ట సాగును చేయాలి. పచ్చిరొట్ట విత్తనాలు వేసిన 30 నుంచి 40 రోజుల మధ్యలో పొలాన్ని దమ్ము, దుక్కి చేయాలి. ఇలా చేయడం వలన పచ్చిరొట్ట మొక్కలు దమ్ము మడిలో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు



పచ్చిరొట్ట పంటల సాగు వల్ల భూసారం పెరుగుతుంది. పంటల్లో పోషకాలు కూడా పెరుగుతాయి. దీనివల్ల పంట అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గిరిజన రైతులకు ప్రభుత్వం అందించే 90 శాతం సబ్సిడీపై విత్తనాలను అందించి పచ్చిరొట్ట సాగును ప్రోత్సహిస్తున్నాం.

బి. సుమలత, ఏఓ, బుట్టాయగూడెం మండలం

వైభవంగా జగన్నాథ రథయాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు నగరంలో జగన్నథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 3.30 గంటలకు స్థానిక రామకోటి ప్రాంగణం నుంచి ప్రారంభమైన యాత్ర మెయిన్ బజారు, పవర్‌పేట, జీఎస్‌టీ రోడ్డు, రామచంద్రరావు పేట, శాతవాహన నగర్‌ల మీదుగా లయన్స్ కల్యాణ మండపం వరకు వెళ్లింది. సాయంత్రం 7.30 గంటల నుంచి స్థానిక శాతవాహన నగర్‌లోని లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో జగన్నాథ స్వామికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజ్య లీలా పరాయణ ప్రభు జగన్నాథుని లీలపై ప్రవచం చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాలను ఇస్కాన్ ఏలూరు శాఖ మేనేజర్ రాధా వల్లభ దాస్ పర్యవేక్షించారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని..

- 175 నియోజకవర్గాలో బైక్‌యాత్ర చేపట్టిన జగన్ అభిమాని
- బైక్‌యాత్రకు స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు


బైక్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతలపూడి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ ఆయన అభిమాని రాజు 175 నియోజకవర్గాల్లో బైక్ యాత్ర చేపట్టాడు. మా నమ్మకం నీవే జగనన్న, మా భవిష్యత్తు నువ్వే జగనన్న అంటూ రాజు చేపట్టిన బైక్ యాత్ర ఆదివారం చింతలపూడి నియోజకవర్గం చేరుకుంది. చింతలపూడిలో రాజుకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం, జతదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన అడవికొట్టు రాజు పాస్టర్‌గా జీవనం సాగిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై మళ్లీ రాష్ట్రానికి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని దీక్ష చేపట్టాడు. ఈ ఏడాది మే 14 వ తేదీన ద్విచక్ర వాహనంపై యాత్రను ప్రారంభించాడు. తనకు 2021లో గుండె నొప్పి రావడంతో ఆరోగ్య శ్రీ పథకంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించి ప్రాణాలు కాపాడారని నిరుపేదల ప్రాణదాత అయిన జగన్‌మోహన్ రెడ్డికి మాత్రమే ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందని ఈ సందర్భంగా తెలిపాడు. ఇప్పటి వరకు 104 నియోజకవర్గాల్లో ప్రచార యాత్ర పూర్తయ్యిందని చెప్పాడు. తన యాత్రలో భాగంగా ప్రజలను చైతన్య పరుస్తూ వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నానని రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తన యాత్ర దిగ్విజయంగా సాగడానికి సహకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపాడు. రాజుకు స్వాగతం పలికిన వారిలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు ఎ.సుబ్బారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మిరియాల దిలీప్, మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం కన్వీనర్ వెంపా కృష్ణ, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం.దుర్గారావు, రేచర్ల రాజు, ముగ్దుం మొహిద్దీన్ తదితరులు ఉన్నారు.

పూరిల్లు దగ్ధం.. రూ. 2.50 లక్షల ఆస్తి నష్టం


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్

వేలేరుపాడు : మండలంలోని ఎర్రబోరు గ్రామంలో తెల్లం పెంటమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. దీంతో సుమారు రెండున్నరలక్షల ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. తెల్లం పెంటమ్మ కుక్కునూరులో తన బంధువుల ఇంటికి ఆదివారం ఉదయం వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో గ్యాస్‌బండలు రెండు పేలడంతో శబ్దానికి గ్రామస్తులు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో 30 వేల నగదు, రెండు ఇనుప బీరువాలు, టీవీ, ఫ్రిజ్, కూలర్‌లు, ఇతర వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో అద్దెకు ఉంటున్న కెచ్చెల అభిమన్యురెడ్డికి చెందిన గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రమేష్, వీఆర్వో బుడిపిటి సంగీతరావు సందర్శించారు. తక్షణ సాయంగా 25 కేజీల బియ్యం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు మండల వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. రూ.5 వేల ఆర్థిక సాయంతోపాటు దుస్తులు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, తాట్కూరుగొమ్ము సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్, కొమ్మరాజు సంతోష్, ఆరిఫ్, కురిమెళ్ల రమేష్, చక్రి పాల్గొన్నారు.

గౌడ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా చింతా అనిల్‌కుమార్


చింతా అనిల్‌కుమార్ గౌడ్

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన చింతా అనిల్‌కుమార్ గౌడ్ ఏలూరు జిల్లా గౌడ సంఘం యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో గౌడ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు అయినాల వెంకటరమణ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన గౌడ సంఘం సమావేశంలో అనిల్ కుమార్ గౌడ్‌కు ఈమేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా గౌడ సంఘం కార్యవర్గ సభ్యులు, గౌడ సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు అనిల్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి యువజన విభాగం అధ్యక్షులుగా నియమించిన గౌడ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గౌడ యువత సమస్యలపై పోరాడటంతో పాటు, వారి అభివృద్ధికి అవసరమైన కృషి శక్తివంచన లేకుండా చేస్తానని అనిల్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు చలుమోలు అశోక్ గౌడ్, కార్యదర్శి వేముల వెంకటాచలం హాజరయ్యారు. గౌడ సంఘం అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం


లక్కవరంలో మాట్లాడుతున్న పార్థసారథి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని టెక్కినవారిగూడెం, లక్కవరం సచివాలయాల్లో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, ఎంఎల్‌వో పి.రాజా మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా వెంకట రమణ, మద్ది ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మళ్లీడి బాబి, వైఎస్సార్‌సీపీ నాయకులు వందనపు సూర్యప్రకాషరావు, నిమ్మ గురునాథరెడ్డి, చిల్ల దుర్గారెడ్డి, దల్లి నాగేశ్వరరావు, తానిగడప శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


కొయ్యలగూడెంలోని ఎంపీపీ స్కూల్లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కొయ్యలగూడెం కొవ్వూరు రోడ్‌లోని మూడవ వార్డు పాఠశాలలో స్మైల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు బొబ్బర మంగరాజు ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పనిచేసిన తాడేపల్లి శ్రీను, తాలూరి కృషివరరావు ఈ విద్యా సంవత్సరం బదిలీపై వెళుతున్న సందర్భంగా విద్యా కమిటీ, గ్రామస్తులు కలిసి వారిని సత్కరించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏలేటి భాస్కర్, వలంటీర్లు బొబ్బర చిట్టిబాబు, ఊసల రాజేష్, పూలపల్లి రవి, ఉపాధ్యాయుల వెంకటేశ్వరరావు, సుశీల, రాజేశ్వరి, విద్యాకమిటీ సభ్యులు తానేటి పార్వతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డుల పంపిణీ


గంగవరంలో రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేసిన దృశ్యం

కొయ్యలగూడెం : గంగవరం సచివాలయం-2 పరిధిలో కౌలు రైతులు 30 మందికి ఆదివారం కౌలు కార్డులు పంపిణీ చేశారు. గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య హాజరై రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపట్ల సోమేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ ఈలుగుబంటి తాతారావు, ఉష దామోదర్ రావు, కోన రాంబాబు, కుర్రి నారాయణరావు, కుర్రి వెంకటేశ్వరరావు, సిబ్బంది బాలార్జున, అచ్యుత్, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

2వేల కౌలురైతుల కార్డుల పంపిణీ

దెందులూరు: మండలంలో 17 పంచాయతీల్లో ఇప్పటి వరకు 2 వేల కౌలురైతుల కార్డులు అందజేస్తామని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ బాబు అన్నారు. ఆదివారం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతుల కార్డుల మంజూరు ప్రక్రియలో ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలానికి 3,200 కౌలు రైతుల కార్డుల పంపిణీ లక్ష్యాన్ని ఇచ్చారన్నారు. ఇంకా 1,200 మంది రైతుల త్వరితగతిన తీసుకోవాలని ఆయన కోరారు. అన్ని గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో రైతులు విత్తనాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తీసుకోవాలని సూచించారు.

సాహిత్యం ద్వారా సమాజ చైతన్యం


సాహితీ సంస్థ రజతోత్సవంలో మాట్లాడుతున్న కవయిత్రి భమిడిపాటి

గణపవరం: సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్యపరచి, మేల్కొలిపే విధంగా ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త, కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి భమిడిపాటి బాలత్రిపురసుందరి అన్నారు. ఆదివారం గణపవరం కేవీపీ ఫంక్షన్ హాలులో ప్రముఖ ఆగమ, ఆధ్యాత్మిక సాహితీ సంస్థ శ్రీవిష్ణుసాయి జ్ఞానజ్యోతి సంస్థ రజతోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో త్రిపురసుందరి మాట్లాడుతూ రాసిన కవిత్వాన్ని పదే పదే చదివితే మనం ఎన్నిసార్లు చదువుతామో అన్ని విజయాలు సొంతం చేసుకోవచ్చునన్నారు. ఏ విషయాన్నైనా ముందుగా గురువు ఆచరించి, దానినే శిష్యులకు బోధించాలన్నారు. మహిళలు సమాజంలో ఒక భాగమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులను, సాహితీ వేత్తలను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కవి సమ్మేళనాలు నిర్వహించారు. 2022వ సంవత్సరం కవితల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. 25 సంవత్సరాల కార్యక్రమాల నివేదికలను చదివి వినిపించారు. జ్ఞానజ్యోతి సంస్థకు అండగా నిలిచిన 25 మంది దంపతులను సత్కరించారు. సాహితీ ప్రముఖులు పెద్దింటి కిరణ్‌కుమార్, చక్రవర్తుల సుబ్బారావు, పల్లిపట్టు నాగరాజు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నగరంలోని కర్షభక్తుల సంక్షేమ సంఘ భవనంలో నిర్వహించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అమీర్ బాషా, కార్యదర్శిగా కేవీ రమణారావు (చిన్ని), కోశాధికారిగా పీవీఆర్ మూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వై.సూరిబాబు, పీఆర్‌ఓగా ప్రదీప్ కుమార్, కన్వీనర్, కుటుంబ భరోసా ఇన్‌చార్జిగా ఎస్ఎన్‌డీ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఫొటో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం చైర్మన్ మాదాల రమేష్, అధ్యక్షుడు మెట్ట నాగరాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్ మరడాని రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల ఫొటో గ్రాఫర్ల సంఘం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

మోటారుసైక్లిస్టుకు తీవ్రగాయాలు

ఉంగుటూరు: బాదంపూడి వద్ద ఎస్ మలుపులో అదుపు తప్పడంతో మోటార్‌సైక్లిస్టు కింద పడిపోయాడు, తలకు రోడ్డు దెబ్బతగలడంతో తీవ్ర రక్త స్రావం అయ్యింది. కైకరం గ్రామానికి చెందిన కాశీ ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద తన సోదరులు ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చాడు. ఆ క్రమంలో కాశీ కైకరం నుంచి ఆలయం వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రగాయాలైన కాశీని తొలుత తాడేపల్లిగూడెం, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జలకళ బోరు ప్రారంభం

దెందులూరు: వైఎస్సార్ జలకళ పథకం రైతులందరికీ వరమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ ఆధ్వర్యంలో రామారావుగూడెం పంచాయతీలో రైతులు కందుల దుర్గారావు, రాధాకృష్ణ, గంగరాజు పొలంలో వైఎస్సార్ జలకళ పథకంలో నిర్మించిన నూతన బోరును కామిరెడ్డి నాని ప్రారంభోత్సవం చేశారు.

నేడు కొణిజర్లలో గడపగడపకు మన ప్రభుత్వం

లింగపాలెం : లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామ పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లింగపాలెం మండలం వైఎస్సార్ సీపీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా హాజరవుతారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు జగనన్న సురక్షపై అవగాహన

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమం కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు జగనన్న సచివాలయాల మండల కో-ఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. అనివార్య కారణాల వలన రేపల్లెవాడ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించాల్సిన జగనన్న సురక్ష ప్రారంభ అవగాహన కార్యక్రమం వేదిక మార్పు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ప్రజాప్రతినిధులతో పాటు నామినేటెడ్ పోస్టులు పొందిన పార్టీ శ్రేణులు, ఉన్నత స్థాయి అధికారులు, ఎంపీడీవో ఆర్‌బీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

పేకాట స్థావరంపై దాడి

టి.నరసాపురం : పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మక్కినవారిగూడెం శివారులో పేకాట స్థావరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు పోలవరంలో బహిరంగ సభ

ఏలూరు రూరల్: పోలవరం నిర్మాణంపై ప్రజలను చైతన్య పరుస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచౌతన్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఏలూరులో నిర్వహించిన పార్టీ సమావేశ వివరాలు వెల్లడించారు. పోలవరం తక్షణం నిర్మించాలని కోరుతూ సోమవారం పోలవరంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. నిర్వాసితులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పి.మధు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్ తులసీరెడ్డి, టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన నాయకులు కందుల దుర్గేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి

ఏలూరు రూరల్: నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోపై అభివృద్ధి బాట పట్టిందని బీజేపీ గోదావరి జోనల ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మదేళ్ల పాలనపై మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. మోదీ చేపట్టిన జనధన్ బ్యాంక్ ఖాతాలు, ముద్ర రుణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్‌తో పాటు జాతీయ రహదారులు నిర్మాణం, విమానాశ్రయాల అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగు నింపాయన్నారు. బీజేపీ అధికారి ప్రతినిధి చందు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాట్రు విజయ్, శరణాల మాలతీరాణి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడికి 108 సిబ్బంది చికిత్స అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక బుట్టాయగూడెం రోడ్‌లో ఒక యువకుడు బ్లేడుతో చేతిపైన, మెడపైన కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. చాగంటి సాయి అనే యువకుడు బ్లేడ్‌తో కోసుకోవడంతో చేతిపై పదిహేను చోట్ల, మెడపై ఐదు చోట్ల గాయాలయ్యాయి. 108 సిబ్బంది రాంబాబు, ధర్మరాజు ఘటనా స్థలంలో ప్రాథమిక చికిత్స చేసి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.